"నాకు పెళ్లి కుదిరిందోచ్!"

గదిలో చతుర్ముఖ పారాయణం చేస్తున్న మా మిత్ర బృందం దగ్గరికి వచ్చి ఆనందంగా ప్రకటించాడు బుచ్చిబాబు!

వాడి ఆనందాన్ని పట్టించుకునేటంత తీరిక లేనంతగా పేకాటలో నిమగ్నమై వున్నారు మా ఫ్రెండ్స్ అంతా. బుచ్చి బాబు వైపు చూస్తూ, "యిదేమన్నా వరల్డ్ కప్ గెలవడం అనుకున్నావా బుచ్చీ! పెళ్లి కుదిరినంత మాత్రానికే అంతగా చంకలు గుద్దుకుంటూ మురిసిపోతున్నావు! ఈ రోజుల్లో ప్రతి అడ్డగాడిదకీ అతి సులభంగా పెళ్లి కుదిరిపోతున్నదిలే" అన్నాడు.

"అవునవును. మర్చే పోయాను సుమా. ఆర్నెల్ల క్రితం నీ పెళ్ళి జరిగినప్పుడూ ఈ విషయం కన్‌ఫర్మ్ అయిందిగా!" అని తకీమని బదులిచ్చాడు బుచ్చిబాబు.




# హనీమూన్

- ఈతకోట తులసీ రామారావు

అంత క్విక్‌గా బుచ్చిబాబు రెస్పాండ్ అవుతాడని ఏమాత్రం వూహించని గౌతమ్ ముఖం నల్లగామాడిపోయింది. తనకు పెళ్ళి కుదరడం పట్ల బుచ్చిబాబు అంత గాఢమైన సంతోషాన్ని పొందటానికి కారణం లేకపోలేదు!

అతిశయోక్తి అనిపించవచ్చేమో గాని, వాడిప్పటికి దాదాపు నూట పదహారు పెళ్లి చూపులకి హాజరయి వుంటాడు. మూడేళ్ల నుండీ వధువు అన్వేషణ కార్యక్రమంలో తీరిక లేకుండా తిరుగుతున్నాడు. చెప్పలు అరగటం సంగతేమో కాని, వెళ్లిన ప్రతి చోట ఫలహారాలు తిని తిని స్థూలకాయం వచ్చే

## కామెడీ కథ



సింది. ముప్పై ఏళ్లు దాటుతున్నాయేమో, తలలో అక్కడక్కడ వెండి తీగలు దర్శనమిస్తున్నాయి. అలాగని పెళ్లి కుదరక పోవటానికి వాడేం అనాకారి కాదు. ఉద్యోగం సద్యోగం లేని ఆవారాగాడు కాదు.

దీనికంతటికీ కారణం బుచ్చిబాబు నాన్న బంగారయ్యకు వున్న డబ్బు ఆశ మరియు యితర గొంతెమ్మ కోరికలు! పెళ్లి అనే వ్యాపారంలో కొడుకుని పెట్టుబడిగా పెట్టి లక్షలకు లక్షలు ఆర్జించాలని ఆయన ఆరాటం. ఇంకా పెళ్లి కావడం లేదని బుచ్చిబాబు క్రుంగిపోతుంటే, ఆశించినంత కట్నం రావడం లేదని వాళ్ల నాన్న హైరానా పడిపోతూ వుండేవాడు. ప్రతి సంవత్సరం వాడి రేటు అంచెలంచెలుగా పెంచుతూ వుండేవాడు. వాళ్ల నాన్న దగ్గర నాకున్న చనువుకొద్దీ, "ఏమిటి బాబాయ్ మీరు మరీ!" అని అడిగేవాడిని.

దాని కాయన, "ఈ వెధవ మీద ఎంత పెట్టుబడి పెట్టాను? ఒక్కో క్లాసు నాలుగేళ్ళకి తక్కువ లేకుండా చదివే వాడు. మరి అదంతా రాబట్టుకోవాలంటే యిదే అవకాశం గదట్రా అబ్బాయ్!" అనేవాడు.

"మరి ప్రతి సంవత్సరం మన బుచ్చిగాడి రేటు విపరీతంగా పెంచేస్తున్నావేమిటి బాబాయ్?" అని అడిగితే తడుము కోకుండా జవాబిచ్చేవాడు.

"రోజురోజుకీ మార్కెట్‌లో రూపాయి విలువ ఎలా పడిపోతున్నదో నీకు తెలుసుగదట్రా అబ్బాయ్! దాన్ని నిలబెట్టుకోవాలంటే కట్నం రేటు పెంచకపోతే ఎలా చెప్పు!" అని లాజిక్ మాట్లాడేవాడు.

కట్నం ఆశకు తోడు ఆయనకి కొన్ని అతి దారుణమైన కోరికలు కూడా వుండేవి. పెళ్లి కూతురికి అక్కచెల్లెళ్ళు, పిన్ని బాబాయ్‌లు, మేనత్తలు యిలా ఎవ్వరూ వుండకూడదని. అలాంటి సంబంధాల కోసం గాలించేవాడు. దీనికి ఆయన చెప్పే సమర్థన ఏమిటంటే, "చుట్టరికాలు ఎక్కువగా వుంటే అమ్మాయిని చూడటం కోసం అనే సాకు పెట్టుకొని వచ్చి వారాలు, నెలలు మావాడి దగ్గర తిష్టవేసి వాడి యిల్లు గుల్ల చెయ్యరూ?" అనేవాడు.

మొత్తానికి బంగారయ్య గారి డబ్బు ఆశ, పిసినారితనం అన్నీ కలిసి బుచ్చిబాబుని యిప్పటికీ బ్రహ్మచారిగానే మిగిల్చాయి. అలాంటిది యిప్పుడు పెళ్లి కుదరటంలో బుచ్చి బాబు ఆనందపడటంలో ఆశ్చర్యం ఏముంది గనక?

బుచ్చిబాబు నా ప్రక్కనే వచ్చి కూర్చుంటూ, "రాజూ! మరి మేము హనీమూన్‌కి ఎక్కడికి వెళితే బావుంటుందంటావు?" అని అడిగాడు. నేను ఏదో సమాధానం చెప్పబోయేలోగా శ్రీరామ్ కల్పించుకుని "ఒరేయ్ బుచ్చీ! మీనాన్న సంగతి తెలిసి కూడా నువ్వు హనీమూన్‌ని గురించి కలలు కంటూనే వున్నావా? ఇద్దరూ వెళితే చార్జీలు దండగని ఒక్కరినే వెళ్లి రమ్మనే రకం మీ నాన్న." అన్నాడు.

ఆ మాట నిజమే అనిపించింది నాకు. ఎందుకంటే బంగారయ్య గారి పిసినారితనం గురించి నాకు బాగా తెలుసు గనుక బోలెడు డబ్బు ఖర్చు పెట్టి కొత్త దంపతులను హనీమూన్‌కి పంపిస్తాడనే నమ్మకం నాకు లేదు. కాని హనీమూన్‌ని గురించి బుచ్చిబాబు ఎన్ని కలలు కంటున్నాడో కూడా నాకు తెలుసు ఎన్నో సార్లు నా దగ్గర ఆ టాపిక్ గురించి ఆశలు వెళ్ళగక్కేవాడు.

గౌతమ్ తన అభిప్రాయం చెప్పాడు.

"బుచ్చీ! నన్ను అడిగితే కొత్త దంపతుల హనీమూన్‌కి సింగపూర్‌ని మించిన ప్రదేశం లేదురా!" జీవన్ మే ఏక్‌బార్ దేఖో సింగపూర్" అని పాట కూడా మనం విన్నాం కదా!"

బుచ్చిబాబు ముఖం నిండా నిరాశ చోటు చేసుకుంది.

"మరీ భారత దేశపు సరిహద్దులు దాటొద్దులేరా! ఇండియాలోనే ఏవైనా మంచి ప్లేసెస్ చెప్పండి!" అన్నాడు.

ఈసారి భాస్కర్ సలహా యిచ్చాడు.

"ఇండియాలో ఖచ్చితంగా చూడవలసిన ప్రదేశాలు ఉత్తరాన కాశ్మీరు, దక్షిణాన కన్యాకుమారి. నా మాట విని ఆ రెండు ప్రదేశాలకు వెళ్లి వచ్చేయ్?"

శ్రీరామ్ కల్పించుకుని, "రెండు ప్లేసెస్‌కి పంపటానికి మీ నాన్న యిష్టపడకపోతే చెరొక చోటికి వెళ్లి వచ్చేయండి!" అన్నాడు.

బుచ్చిబాబుని నేను శాంతపరుస్తూ, "నువ్వేం దిగులు పడకురా బుచ్చీ! పెళ్లికి వచ్చినపుడు మీ నాన్నతో మాట్లాడి ఆయన్ని ఒప్పించి మా యిద్దరినీ హనీమూన్ పంపేలా చేస్తాను" అని భరోసా యిచ్చాను.

బుచ్చిబాబు ముఖంలోకి వెలుగు వచ్చింది.

నెల రోజుల తర్వాత బుచ్చిబాబు పెళ్లి జరిగిపోయింది.

పెళ్లిలో బంగారయ్య గారితో బుచ్చిబాబు హనీమూన్ విషయం గురించి మాట్లాడే అవకాశం నాకు చిక్కలేదు. ఎలాగూ రిసెప్షన్ వుందిగదా, ఆ రోజు మాట్లాడుతాలే' అని బుచ్చిబాబుకి నచ్చ చెప్పాను.

రిసెప్షన్ పూర్తయింది!

బంగారయ్య గారి దగ్గరకు వెళ్లబోయాను. ఆ సమయంలో ఆయన బుచ్చిబాబుని ఎందుకో చెడామడా చివాట్లు పెడుతున్నాడు. ఇది సమయం కాదని వచ్చేశాను. ఆ తర్వాత బుచ్చిబాబుని విషయం ఏమిటని ఆరా తీశాను.

రిసెప్షన్‌కి నా తరఫున భోజనానికి పదిహేను మంది ఫ్రెండ్స్ వస్తారని ఆయనతో చెప్పాను. ఆయన లెక్క గట్టుకొని పదహారు మంది వచ్చారని తెలుసుకొని చీవాట్లు పెట్టాడు." అన్నాడు బిక్క ముఖంతో బుచ్చిబాబు.

"మరి ఎలా మేనేజ్ చేశావు?" అని అడిగాను.

"ఆ పదహారో స్నేహితుడు నా కోసం మూటపదహారు రూపాయిలు గిఫ్ట్ చెక్ తెచ్చాడని సర్ది చెప్పేశాను." అన్నాడు బుచ్చిబాబు.

"ఆహా! బంగారయ్యా!" అని అనుకోకుండా వుండలేకపోయాను.

ఆయన ఒంటరిగా వున్న సమయం చూసుకుని వెళ్లి ప్రక్కన కూర్చొని బుచ్చిబాబు దంపతుల హనీమూన్ ప్రసక్తి తెచ్చాను.

"హనీమూనా? అదెందుకు? డబ్బు దండగ!" నేనూహించినట్లే ఒక్క మాటలో తేల్చిపారేశాడు ఆయన.

"అది కాదు బాబాయ్! హనీమూన్ వల్ల చాలా లాభాలున్నాయి. భార్యాభర్తలు ఒకరినొకరు ఎంచక్కా అర్థం చేసుకోవడానికి, అన్యోన్యంగా కాపురం చెయ్యటానికి ఈ హనీమూన్ ఎంతగానో సహకరిస్తుంది." అన్నాను.

కానీ అంత సులభంగా అంగీకరిస్తే ఆయన బంగారయ్య ఎందుకవుతాడు?

"విడ్డూరంగా మాట్లాడుతున్నావురా అబ్బాయ్! హనీమూన్‌కి వెళ్లని మొగుడూ పెళ్ళాలు అన్యోన్యంగా కాపురం చెయ్యడం లేదనీ, అపార్థాలతో బ్రతుకుతున్నారనీ నీ అభిప్రాయమా? నేను మా ఆవిడ ఏ హనీమూన్‌కి వెళ్లలేదే? అయినా భేషుగ్గా కాపురం చెయ్యటం లేదూ యిన్నేళ్లుగా?" అని దబాయించాడు.

ఆయన్ని ఒప్పించటం నా వల్ల కాని పని అని అర్థం అయిపోయింది. అయితే బుచ్చిబాబు కోరికను నేను మర్చిపోలేక పోతున్నాను. ఎలాగైనా ఆయనని అంగీకరింపజేయాలని నిర్ణయించుకున్నాను.

అందుకే అర్జంటుగా రూటు మార్చాను. ఆయన చెవి దగ్గర చేరి స్వరం తగ్గించి, "హనీ మూన్ వల్ల బోల్డు డబ్బు లాభాలు కూడా వున్నాయి బాబాయ్!" అన్నాను.

ఆయన ఆశ్చర్యంగా, "అదెలా? హనీమూన్ అంటే డబ్బు ఖర్చు వ్యవహారమే కదా!" అన్నాడు.

నేను చెప్పడం ప్రారంభించాను.

"అమ్మాయి హనీమూన్‌కి వెళుతున్నదంటే వాళ్ల అమ్మా నాన్నలు, అక్క బావలు, మేనత్తలు చాలా డబ్బు అంటే వేలల్లో ఆ అమ్మాయికి యిచ్చి పంపిస్తారు. మన వాడు ఆ అమ్మాయితో బాగా కలిసిపోయి మాటలతో మంచి చేసుకుని ఆ డబ్బు నొక్కెయ్యచ్చు. అంతేకాదు. అమ్మాయి నాన్నకి ఎక్కడెక్కడ ఎన్నేసి ఆస్తిపాస్తులు వున్నాయో, ఏ బ్యాంక్‌లో ఎంతెంత ఫిక్స్‌డ్ డిపాజిట్లు వున్నాయో వివరాలన్నీ రాబట్టుకోవచ్చు."

నా మాటలతో బంగారయ్య ముఖంలో కళ వచ్చింది.

"అంతేనంటావా?" అన్నాడు.

"అంతే మరి! మీరింకేమీ ఆలోచించకుండా వాళ్లిద్దరినీ కాశ్మీర్‌కో, కన్యా కుమారికో పంపించెయ్యండి" అని తొందర పెట్టాను.

"మరీ అంతంత దూరమా? బోలెడు డబ్బు ఖర్చు అవుతుందేమో! పోనీ అరకు లోయకి పంపిస్తే ఎలా వుంటుంది?" అన్నాడు.

"ఛండాలంగా వుంటుంది. అటు కాశ్మీరు, యిటు కన్యా కుమారి కాకుండా మధ్యస్థంగా ఊటీకి పంపించేద్దాం. ఇంకే మాట్లాడకండి" అన్నాను.

ఆయన చివరికి సరేనన్నారు.

బుచ్చి బాబుకి యీ వార్త చెప్పగానే వాడి ముఖం దేదీప్యమానంగా వెలిగింది.

"థాంక్స్ రా రాజు!" అన్నాడు.

"ఊటికి వెళ్ళి ఎంచక్కా హనీమూన్ ఎంజాయ్ చేసుకొని తిరిగిరా!" అని అభినందించి నేను వచ్చేశాను.

బుచ్చిబాబు ఎప్పుడు తిరిగొస్తాడా, వాడి హనీమూన్ విశేషాలు తెలుసుకుందామా అని నేను ఆత్రంగా ఎదురు చూస్తున్నాను.

పదిహేను రోజుల తర్వాత బుచ్చిబాబు తిరిగొచ్చాడు. అయితే నేను ఆశించినట్లుగా వాడి ముఖం ఆనందంతో వెలిగిపోవడం లేదు. మొదటి వారమే డబ్బాలు తిరిగొచ్చిన సినిమా నిర్మాత ముఖంలా వాడిపోయి వుంది.

"ఏరా బుచ్చీ! హనీమూన్ బాగా జరిగిందా? విశేషాలు చెప్పరా!" అన్నాను.

"మేం ఊటీకి వెళ్లలేదురా రాజు!" అన్నాడు ముఖం గంటు పెట్టుకుని.

"అదేం? మీ నాన్న ఆఖరి క్షణంలో మనసు మార్చుకున్నాడా?" అనుమానం వ్యక్తం చేశాను.

"కాదు మా ఆవిడే సహకరించలేదు. హనీమూన్ అని ప్రయాణం పెట్టుకోగానే పిచ్చి పిచ్చిగా కలవరిస్తూ స్పృహ తప్పి పడిపోయేది." అన్నాడు బుచ్చిబాబు.

"ఎందుకని అలా?"

"అదో రకం ఫోబియా అట. వాళ్ల కుటుంబానికి హనీమూన్ అచ్చిరాదనే సెంటిమెంట్! ఈ హనీమూన్ కార్యక్రమం వల్ల వాళ్ల వంశంలో చాలా అనర్థాలు జరిగాయట. వాళ్ళ మేనత్త ఒకావిడ భర్తతో హనీమూన్ ఊటీ వెళ్లి హోటల్‌లో వుండి వారం తర్వాత ఆ హోటల్ మేనేజర్‌తో లేచిపోయిందట. వాళ్ళ పిన్ని కూతురు హనీమూన్ వెళ్ళి అక్కడ హోటల్‌లో ఒకరోజు కళ్ళు తిరిగి పడిపోయిందట. డాక్టరు వచ్చి చూసి నెల తప్పిందని తేల్చి చెప్పాడట! ఆ దెబ్బతో భర్త ఆమెను వదిలేశాడట." బుచ్చి బాబు గద్గద స్వరంతో చెప్పకుపోతున్నాడు.

"వదిలెయ్యటం ఎందుకు? హనీమూన్ పూర్తయ్యే నాటికి ఆవిడ నెల కూడా తప్పిందంటే వాళ్లు హనీమూన్‌ని సద్వినియోగం చేసినట్లేగా!" అన్నాను.

"నిజమే అనుకో! కాని వాళ్ల పెళ్లి అయి అప్పటికి పదిహేను రోజులే అయింది. ఆవిడకి మూడో నెల అట. ఇక వదిలెయ్యక చస్తాడా?" అంటూ నా అనుమానం నివృత్తి చేశాడు బుచ్చిబాబు.

తర్వాత మళ్ళీ తన మాటలను కొనసాగించాడు. ఈ కారణాల చేత నా భార్యకి హనీమూన్ అంటే ఎలర్జీ పుట్టుకొచ్చిందంట. అందుకే విసుగొచ్చి ఆ కార్యక్రమాన్ని వదిలేశాను."

"పాపం బుచ్చిబాబు!" అనుకున్నాను.

"అయితే హనీమూన్ కోరిక తీర్చుకోకుండానే తిరిగొచ్చేశావన్న మాట!" అన్నాను.

"బయట వూళ్ళకి వెళ్లాలంటే ఆవిడకు సెంటిమెంట్ కనుక వూళ్ళోనే ఏదైనా హోటల్‌లో అరేంజ్ చేసుకుందాం అని నచ్చ చెప్పి ఆవిడను ఒప్పించాను. మా నాన్న పిసినారితనం వల్ల అది దారుణంగా బెడిసి కొట్టింది." ఏడువు ముఖం పెట్టుకుని చెప్పాడు బుచ్చిబాబు.

"అదెలా?" ఆసక్తిగా అడిగాను.

"డబ్బుకి కక్కుర్తి పడి ఏదో ఏబ్రాసి రకం హోటల్‌లో రూమ్ బుక్ చేశాడు మా నాన్న. అన్ని ముదనష్టపు కార్యక్రమాలకు ఆ హోటల్ పెట్టింది పేరట. హోటల్ వాళ్లు యీ నెలలో పోలీసులకు మామూళ్ళు ఎగ్గొట్టారట. ఆ కోపంతో ఆ రాత్రి వాళ్ళు హోటల్ మీద రైడింగ్ చేశారు. అందరితోపాటు మా యిద్దరినీ స్టేషన్‌కి లాక్కెళ్ళారు. మేం ఆ బాపతు కాదనీ కొత్తగా పెళ్లయిన దంపతులం అనీ ఎంత చెప్పినా వినిపించుకోలేదు. మామూళ్ళు దక్కలేదన్న కోపంతో వున్న ఆ ఎస్సై! ఆ రాత్రంతా స్టేషన్లో జాగరణ! తెల్లారి మా నాన్న వచ్చి ఎస్సైకి ముడుపులు చెల్లించి విడిపించాడనుకో! మా ఆవిడ నన్ను తిట్టని తిట్టు లేదనుకో!" మా కుటుంబానికి హనీమూన్ అచ్చిరాదని మొదటి నుంచీ మొత్తుకుంటూనే వున్నాను. వినిపించుకుంటేనా? ఇంకోసారి హనీమూన్ మాట ఎత్తారంటే మా పుట్టింటి కెళ్లిపోతాను" అని అల్టిమేటం కూడా యిచ్చింది.

బుచ్చి బాబు మాటలు విన్న నాకు వారి పట్ల జాలితో హృదయం నిండిపోయింది.

"పోనీ లేరా బుచ్చీ! ఈ జన్మకు నీకు హనీమూన్ యోగం లేదని గుండె రాయి చేసుకుని బ్రతుకు. బెటర్ లక్ యిన్ నెక్స్ట్ జన్మ!" అని ఓదార్చాను.

బుచ్చిబాబు నన్ను వాటేసుకుని భోరుమన్నాడు!




